కథావేదిక

# "నివురు గప్పిన దయ"

**- విశారద**

**"బస్తాల్ని కాస్త సరిగా కుట్టి ఏడవండిరా... వడ్లన్నీ నేలపాలవుతున్నాయి" వసారాలో, తన పడక్కుర్చీలో కూర్చున్న వెంకట సుబ్బయ్యగారు కూలీలవైపు చూస్తూ అరిచాడు.**

**ఒడ్లు కొలిచి బస్తాల్లో పోసి, తాడుతో చకచకా కుట్టేస్తున్న పాలేరు కొండయ్య తలెత్తి "చిత్తం దొరా.." అన్నాడు వినయంగా!**

**"బస్తాలని జాగ్రత్తగా ట్రాక్టర్ మీదకి ఎక్కించండి. త్వరగా కానివ్వండి. ఎండెక్కుతుంది. ఎర్రటి ఎండలో అనవసరంగా ఛస్తార్రా పిచ్చి సన్నాసుల్లారా. త్వరత్వరగా పని ముగించుదామని వుండదు." లేచి ట్రాక్టర్ దగ్గరకొస్తూ అన్నాడు వెంకట సుబ్బయ్యగారు.**

"చాలా పిసినిగొట్టులా వున్నాడే. ఒడ్లు నేలపాలు కాకుండా కొలవాలట. బస్తాలు జాగ్రత్తగా కుట్టాలట. మన దగ్గర నుండీ అసలు కదలడంలేదు. వడ్ల బస్తాలు మిల్లు చేరిందాకా మనెంటే వుంటాడంటావా?" అడిగాడు కొత్తగా పనిలో చేరిన పాలేరు రాములు.

"దొరగారు చాలా ఖచ్చితమైన మడిసి. తన కివ్వాల్సిన సొమ్ములో ఒక్క రూపాయి తగ్గినా వూరుకోడు. ఒకరి కివ్వాల్సిన దాంట్లో రూపాయి కూడా వుంచుకోడు. అయినా పెద్దోళ్ళ యవ్వారాలు మనకెందుకు? మన జీతం, తిండీ అంతా బాగానే సూస్తున్నాడు గదా.. కానీ పని కానీయ్. కబుర్లాడుకుంటూ పని సెయ్యడం సూస్తే దొరకి సెడ్డ సిరాకు." అన్నాడు బస్తాన్ని భుజానికెత్తుకుంటూ కొండయ్య.

"ఆ అయ్యని సూస్తుంటేనే భయమేస్తాంది. ఎప్పుడైనా పది పరకా అవసరమైతే ఇస్తాడంటావా?" గొంతు తగ్గించి మెల్లగా అడిగాడు రాములు.

"ఎందుకవసరమో కారణాలు అడిగి అడిగి, తప్పదనుకుంటే ఇస్తాడు. వాటిని మళ్ళీ జమ చేసుకుంటాడు" చెప్పాడు కొండయ్య.

"సానా పెద్ద పీనాసన్నమాట." సన్నటి జరీ అంచు పంచెతో, బుంగమీసాలతో, గంభీరంగా హుందాగా వున్న వెంకట సుబ్బయ్యగారిని చూస్తూ, పైకే అన్నాడు రాములు.

"ష్.. యెవురైనా యింటారు. నోర్మూసుకొని పని కానీయ్" మందలిస్తున్నట్టుగా అన్నాడు కొండయ్య.

"అంతేలే. ఆయనగోరి సంగతి మనకెందుకు.." అంటూ దబ్బనం- నులకతాడు చేతిలోకి తీసుకుని బస్తాలని కుట్టడంలో నిమగ్నమయ్యాడు రాములు.

• • •

మధ్యాన్నం మూడు గంటలవేళ...

ఎండ తీవ్రత తట్టుకోలేక.. కాకులు వేపచెట్టుమీద గోలగా అరుస్తున్నాయి.

పనిమీద పక్కనేవున్న టౌన్‌దాకా వెళ్ళి తిరిగొస్తున్న వెంకట సుబ్బయ్యగారి చూపులు... అక్కడే ఆగిపోయాయి.

రోడ్డుపక్కనే ఒక చిన్న గోనెసంచీ పరచుకుని నేరేడు పళ్ళు అమ్ముతున్నాడో ఏడెనిమిదేళ్ళ కుర్రాడు. వడగాలికి వడలి వాడిపోయిన లేత బుగ్గలు, పీక్కుపోయిన మొహం.. అయినా పళ్ళు అమ్ముతూ అక్కడే కూర్చున్నాడు వాడు.

ప్రొద్దున తను టౌనుకెళ్ళేటప్పుడు చూసాడు వాణ్ణి. అప్పుడు గోనెసంచి నిండా పళ్ళున్నాయి. సగానికి పైగా అమ్ముడుపోయినట్టున్నాయి. ఆ మిగిలినవి కూడా అమ్మితేగానీ అక్కడ నుండీ కదలడు కాబోలు!

"డ్రైవర్.. కారాపు." అన్నాడు వెంకట సుబ్బయ్యగారు.

సడెన్ బ్రేక్‌తో కారాగింది.

"కారుని కాస్త వెనక్కి నడిపి, ఆ నేరేడుపళ్ళ దగ్గర ఆపు" అటువైపే చూపిస్తూ చెప్పాడు.

డ్రైవర్ కారు తీసుకెళ్ళి సరిగ్గా అక్కడే ఆపాడు.

"నేరేడుపళ్ళు తేవాలా సార్?" అడిగాడు వెనక్కు తిరిగి.

"నేనే వెళ్తాను" అంటూనే డోర్ తెరచి కిందికి దిగాడు వెంకట సుబ్బయ్యగారు.

కారు దిగి వస్తున్న తనవైపే వింతగా చూస్తున్న కుర్రాణ్ణి "ఎలా ఇస్తున్నావ్?" అడిగాడు.

"రూపాయికి నాలుగు పళ్ళు" అంటున్నే ఇంకా వింతగా చూస్తూ చెప్పాడు కుర్రాడు.

"ఏడు ఇస్తావా?" వెంకట సుబ్బయ్యగారు బేరాలు మొదలుపెట్టాడు.

"రావండి.." తల అడ్డంగా వూపాడు కుర్రాడు.

"పోనీ అరడజనివ్వు.."

"మా అమ్మ తిట్టుతాది. ఇవ్వను" కారులో వచ్చి కూడా భలే బేరమాడుతున్నాడే ఈయన అనుకున్నాడు వాడు.

"తిడుతుందా.. ఎందుకు?"

"ఎందుకేంటి బాబుగారూ.. మేమంతా పనిచేసి సంపాయిస్తేగానీ ఇల్లు గడవదు."

"మీ ఇంట్లో మొత్తం ఎంతమంది వుంటారు?"

"మా అమ్మ, అక్క, నేను, చెల్లెళ్ళిద్దరు. మా అయ్య మమ్మల్ని వదిలేసి ఎటోపోయాడంట. అమ్మ కూలీ పనికెల్తది. అక్క మున్సబుగారింటికాడ పని చేస్తది. పెద్ద చెల్లి కూడా కూలీ పనికెల్తది." వివరంగా చెప్పాడా కుర్రాడు.

"నీపేరేంటి?"

"కిష్టిగాడండి."

"నువ్వు బళ్ళోకెళ్ళి చదువుకోవచ్చుకదా." అడిగాడు వెంకట సుబ్బయ్యగారు.



''బలే వోరే మీరు! బల్లోకెల్తే పలకా, పుస్తకాలకి డబ్బెవరిత్తారు? ఈ కాయలమ్మితే నాలుగు రూపాయలొత్తాయట. మా అమ్మ చెప్పింది.''

''అలాగా! సరే రూపాయికి అయిదు నేరేడుపళ్ళివ్వు.''

''తీసుకోండి'' పళ్ళు ఏరి ఇవ్వబోయాడు కిష్టి

''నేనే ఏరుకుని తీసుకుంటాను'' వాణ్ణి వారిస్తూ అన్నాడు వెంకట సుబ్బయ్యగారు.

'చాలా పిసినిగొట్టులా వున్నాడు. పెద్ద పెద్ద పళ్ళు ఏరుకోవాలని గావాను.' అనుకున్నాడు కిష్టిగాడు ఆయనవైపే చూస్తూ.

''ఎన్నికావాలి?'' ఎక్కువ తీసుకుంటాడేమోనని ఆయన చేతివంకే చూస్తూ అడిగాడు వాడు.

''వుండు.. ఏరుకోనీ నన్ను.'' వెంకట సుబ్బయ్యగారు పళ్ళు ఏరుకుంటున్నాడు.


''ఒకటి.. రెండు.. మూడు..'' కిష్టిగాడు కూడా లెక్కపెడుతున్నాడు.

ఇరవై నేరేడుపళ్ళు ఏరాక ఆయన ఆగాడు.

''పాతిక పళ్ళు తీసుకున్నాను. ఎంతివ్వాలి? ఐదు రూపాయలుకదూ..'' అన్నాడు వెంకట సుబ్బయ్యగారు జేబులో చెయ్యిపెడ్తూ!

కిష్టిగాడికి అర్థంకాలేదు. 'ఇరవై పళ్ళేకదా అయ్యాయి. పాతిక అంటాడేంటి ఈయన. తనే తప్పు లెక్కపెట్టాడా?'

కిష్టిగాడింకా అయోమయంలో వుండగానే వెంకట సుబ్బయ్యగారు వాడి చేతికి ఐదు రూపాయలిచ్చి వెళ్ళిపోయాడు.



కాస్సేపటికి పళ్ళన్నీ అమ్మేసాక, గోనెసంచీ దులుపుతుంటే, మడతల్లోంచి పది రూపాయల కాగితం జారిపడింది.

కిష్టిగాడు 'ఇదెక్కడిదా!' అని ఆలోచనలో పడ్డాడు.

'ఆ కార్లో వచ్చినాయనదే ఇది. పళ్ళు ఏరుకొనేప్పుడు ఆయన జేబులోంచి జారిపడి వుంటుంది' అనుకున్నాడు.

పరుగు పరుగున ఇంటికెళ్ళి తల్లికి చెప్పాడు.

''ఆ కార్లో వచ్చిన బాబుదే అయ్యుంటాది. పరుల సొమ్ము మనకెందుకురా నాయనా. రేపా బాబు అటుగా వస్తే పిల్చి ఇచ్చెయి'' అందామె.

''కార్లో వచ్చాడు గదమ్మా.. ఆళ్ళకీ పదిరూపాయలో లెక్కా! తిరిగి ఇయ్యాలా మనం.'' కిష్టిగాడు అయిష్టంగా అన్నాడు.

''తప్పునాయనా! అలా ఆలోచించకు. ఎవరి సొమ్మయినా సొమ్మే! రేపా బాబుకిచ్చెయ్యి.'' అంది తల్లి లక్ష్మి కాస్త కఠినంగా.

కిష్టిగాడు మరింకేం మాట్లాడలేదు.

• • •

రెండ్రోజుల తర్వాత, వెంకట సుబ్బయ్యగారు టౌనుకెళ్ళొస్తూ, మళ్ళీ కిష్టిగాడి దగ్గర కారాపారు. పళ్ళు తేవడానికి వెళ్ళబోతున్న డ్రైవర్ని వారించి తనే కారు దిగి వాడి దగ్గరకి వచ్చాడు.

''ఒరేయ్ అబ్బాయ్.. నీ నేరేడుపళ్ళు చాలా బావున్నాయట. మా వాళ్ళు ఇంకా తెమ్మన్నారు. ఈ కాయలన్నీ ఎంతకిస్తావ్?'' అడిగాడాయన గోనె సంచీ మీదున్న నేరేడుపళ్ళని చూస్తూ.

వాడు దానికి సమాధానం చెప్పకుండా, ''అయ్యగారూ, నిన్న మీరు పది రూపాయలు పారేసుకున్నారు.'' అన్నాడు తిరిగి ఇవ్వబోతూ.

వెంకట సుబ్బయ్యగారు వాడి మాటల్ని పట్టించుకోలేదు.

''నేను పారేసుకోవడమేంటి? అది నాది కాదు. ఈ కాయలన్నీ ఎంతకిస్తావో త్వరగా చెప్పు.''

''మొత్తం అన్నీ కావాలా?''

''అవును.''

''పది రూపాయలు.''

''తొమ్మిదికిస్తావా?''

క్రిష్టిగాడు ఆయనవైపు ఆశ్చర్యంగా చూసాడు. ఇలా బేరాలాడతాడేంటీ అన్నట్టు.

''మా అమ్మ తిడతది ఇవ్వను'' ఖచ్చితంగా చెప్పాడు వాడు.

''తొమ్మిదిన్నరకిస్తావా?''

''ఇవ్వను. కావాలంటే పావలా తగ్గిత్తాను.''

''మరి పావలా తగ్గిస్తే మీ అమ్మ తిట్టదా?'' నవ్వు దాచుకుంటూ అడిగాడు.

''తిట్టదు. రోజూ మా అమ్మ నాకు కాయలన్నీ అమ్మాక ఓ పావలా ఇస్తది. ఆ పావలాతో రెండు శనగ వుండలు కొనుక్కెళ్తాను మా చెల్లెళ్ళిద్దరికీ ఇవ్వడానికి. ఇయ్యాల వుండలు మానేసి మీకు ఆ పావలా తగ్గిత్తాను. అన్నిసార్లు అడుగుతున్నారుగా మరి.'' క్రిష్టిగాడు కాస్త నిస్సహాయంగా.. వెంకట సుబ్బయ్యగారి వైపు అదోలా చూస్తూ అన్నాడు.

వెంకట సుబ్బయ్యగారు తన బుంగ మీసాల్లోంచి నవ్వీ నవ్వనట్టు చూసాడు వాడివైపు. ఆయన మొహంలోని భావాల్ని ఆ మీసాలు బైటికి కనపడనిస్తేకదా..!

''సరే.. ఆ పళ్ళన్నీ ఈ సంచిలోవేసి ఇవ్వు. ఇవిగో పదిరూపాయలు.'' వాడిచేతికి పది రూపాయలిచ్చి, నేరేడు పళ్ళు సంచి అందుకుని వెనక్కి తిరిగాడు.

''తగ్గించిన పావలా రేపివ్వు. ఇప్పుడు నాదగ్గర చిల్లరలేక పదినోటిచ్చాను నీకు'' అన్నాడు కారెక్కుతూ.

'కారుల్లో తిరిగే ఈయన పావలాకి కూడా బేరమాడుతున్నాడు' వెళ్ళిపోతున్న కారువైపే ఆశ్చర్యంగా చూసాడు క్రిష్టిగాడు.

'ఈరోజు కష్టపడకుండానే కాయలన్నీ అప్పుడే అమ్ముడుపోయాయి. ఇయ్యాల త్వరగా ఇంటికి వెళ్ళిపోవచ్చు.' సంతోషంగా లేచాడు.

గోనె సంచీ దులిపి మడతపెట్టబోతూంటే, రెండు వందల రూపాయల నోట్లు కిందపడ్డాయి. వాడు కంగారుగా కారెళ్ళినవైపు చూసి గట్టిగా పిలవబోయాడు.

కారు అప్పుడే మలుపు తిరిగి కనుమరుగైంది.

గబగబా ఇంటికెళ్ళి తల్లితో చెప్పాడు. అప్పుడే పక్క వూరు నుండి వచ్చిన క్రిష్టిగాడి మేనమామ సంగతంతా విన్నాడు.

''ఈ రోజుల్లో ఇలాంటి ఎర్రిమారాజులు ఎవరుంటార్రా నాయనా..'' అన్నాడు మేనల్లుడ్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుంటూ.

''అవును మావయ్యా! ఆయనెవరో అమాయకుడు. కారులో వస్తాడు. పావలా దగ్గర కూడా బేరమాడతాడు. పదిరూపాయలు, వంద రూపాయలు పోగొట్టుకుంటాడు. పాపం.. ఎలా బతుకుతాడో ఏంటో.'' అన్నాడు క్రిష్టిగాడు పెద్ద ఆరిందాలా!

లక్ష్మి ఆలోచనలో పడింది. ఒక్క క్షణం ఆగి అంది–

''ఆయన అమాయకుడు కాదురా క్రిష్టిగా. దయామయుడు.'' అంది ఏదో అర్థమైనట్టుగా.

క్రిష్టిగాడి మావయ్యకి ఏదో అనుమానం వచ్చింది.

''ఏవన్నావురా క్రిష్టిగా.. ఆయన కార్లో వచ్చాడా? ఏ రంగుకారు?'' అడిగాడు క్రిష్టిగాడ్ని ఆరాగా!

''తెల్లగా వుంది. ఆ బాబుగారిలాగే..'' వత్తి పలుకుతూ చెప్పాడు వాడు.

''తెల్లటి కారా? ఈ చుట్టుపక్కల తెల్లటికారు వెంకట సుబ్బయ్యగారికి తప్ప ఎవరికీ లేదే..'' ఆలోచిస్తూ అనుకున్నాడు క్రిష్టిగాడి మేనమామ.

''ఒరేయ్ క్రిష్టిగా.. ఆ కార్లో వచ్చినాయన ఎలావున్నాడురా?'' అడిగాడు కాస్త అనుమానంగా.

''అంత పొడుగున్నాడు.. ఇంత పెద్ద మీసాలున్నాయి. పెద్దపులిలా రీవిగా.. దర్జాగా వున్నాడు.'' చెప్పాడు క్రిష్టిగాడు చేతులు తిప్పుతూ.

సందేహంలేదు. ఆ పెద్దమనిషి వెంకట సుబ్బయ్యగారే అయివుంటారు. కానీ ఆయన డబ్బు దగ్గర ఖచ్చితమైన మనిషని విన్నాడేతను. మరి ఇదంతా ఏవిటి?

ఆలోచిస్తున్న అతనికి హఠాత్తుగా ఏదో అర్థమైనట్టే తోచింది. ఒడ్లు నేలపాలు కాకుండా సరిగ్గా బస్తాలు కుట్టమని చెప్పడంలో, ఆ నేలపాలైన ఒడ్లే మరొకరికి పట్టెడన్నమై కడుపు నింపుతాయన్న సదుద్దేశ్యం వుంది. తనకు రావాల్సిన డబ్బుని అణాపైసలతో సహా వసూలు చెయ్యడం వెనక.. ఇలా నిస్సహాయులకూ, నిరాశ్రయులకు సహాయ పడాలన్న సహృదయత వుంది. వెంకట సుబ్బయ్యగారి అసలురూపం ఇదా..'' విస్మయంగా అనుకున్నాడతను.

''మీ అమ్మ అన్నదే నిజంరా క్రిష్టిగా. ఆయన అమాయకుడు కాదు. సానా పెద్ద మనసున్నవాడు. ఆ బేరవాడ్డం పీనాసితనంకాదు. నివురు గప్పిన దయ అది.'' నిగూఢ రహస్యమేదో తనకి తెలిసిపోయినంత సంభ్రమంగా అన్నాడతను.

''నేను మళ్ళీ రేపొస్తానమ్మా లక్ష్మీ..'' అంటూనే హడావుడిగా అక్కడ్నుంచి కదిలాడు. తన తోటి పాలేరు కొండయ్యని కలవడానికి.

ఒడ్లబస్తాలు కుడుతున్న రోజున తను వెంకట సుబ్బయ్యగారిని 'పెద్ద పీనాసివాడు' అన్న మాట గుర్తొచ్చి సిగ్గుపడ్డాడు ఆయన దగ్గర కొత్తగా పన్లో చేరిన పాలేరు రాములు. తను చూసిన విషయం చెప్పడానికి అతని అడుగులు వడివడిగా పడుతున్నాయి కొండయ్య ఇంటివైపుగా.

★



## నాన్‌స్టిక్

తల్లి(కొడుకుతో) : అరుణ్! బబుల్ గమ్ ఎందుకు తింటున్నావు? అది గొంతుకు చుట్టుకుపోతుంది...''

అరుణ్: ''కాదమ్మా! ఇది నాన్‌స్టిక్ బబుల్‌గమ్''

## గిన్నీస్‌బుక్

తల్లి: సోనూ! కృష్ణుడు చిన్నప్పుడు ఒక్క వేలుతో పెద్ద కొండనెత్తాడు తెలుసా?''

సోనూ: ''నేను నమ్మనమ్మా''

తల్లి: ''ఎందుకు?''

సోనూ: అది గిన్నిస్‌బుక్‌లో లేదుగా''

## ఎదురుచూపు

క్లాసురూమ్‌లో టీచరు పిల్లల్ని ''నేనే ప్రధానమంత్రినైతే'' అన్న విషయం మీద వ్యాసం వ్రాయమంది. ఒక్క టామ్ తప్ప అంతా రాయటం మొదలుపెట్టారు.

''టామ్! నువ్వెందుకు రాయడం లేదు'' అడిగింది టీచర్.

''నా పి.ఎ కోసం ఎదురుచూస్తున్నాను టీచర్'' చెప్పాడు రాము.

## అమృతాంజన్

రవి: ''రాజూ, రెస్లింగ్‌లో ప్రైజ్ వచ్చినందుకు కంగ్రాచ్యులేషన్స్ ఇంతకీ బహుమతేమిచ్చారు?''

రాజు: ''ఒక డజను అమృతాంజనం బాటిల్సు''

## కాప్

సేల్స్‌మన్: ''ఈ కాప్ చాలా బావుంటుంది సార్! ఇది పెట్టుకుంటే మీరు పదేళ్ళు చిన్నగా కనిపిస్తారు''

కస్టమర్: ''అయితే నాకిది వద్దు. కాప్ తీసేసినప్పుడల్లా పదేళ్ళ పెద్దగా కనిపించడం నాకిష్టం లేదు.

- స్వాతి

